క్లుప్తంగా

విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న అగ్రి విద్యార్థులు

జమ్మికుంట రూరల్: మండలంలోని తనుగుల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పీఆర్ఏ (పార్టిసిపేటరీ రూరల్ అప్రైజల్)పై కేవీకే శాస్త్రవేత్త మహేష్, రావెప్ మానిటర్ అంజలి పర్యవేక్షణలో మల్లారెడ్డి యూనివర్సిటీ వ్యవసాయశాస్త్ర విభాగానికి చెందిన విద్యార్థులు సోమవారం అవగాహన కల్పించారు. గ్రామం నమూనా పటం, సమస్యలు, మట్టి అనుకులత వంటి అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో అగ్రీ విద్యార్థులు రక్షితారెడ్డి, రమ్య, రష్మికా యాదవ్, పల్లవిరెడ్డి, సహస్ర వడ్లపాటి సంధ్య తదితరులతోపాటు విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గురుకులంలో విద్యాశిబిరం



బృంద చర్చలో విద్యార్థినులు

గంగాధర: మండలంలోని మధురానగర్ చౌరస్తా మైనారిటీ గురుకుల విద్యాలయంలో కలెక్టర్ సహకారంతో హైదరాబాద్‌కు చెందిన స్వచ్ఛంద సంస్థ సోమవారం విద్యాశిబిరాన్ని ప్రారంభించింది. పదిరోజుల పాటు నిర్వహించే శిబిరంలో యుక్తవయసులో బాలికలకు జ్ఞానం, జీవిత నైపుణ్యాలు, కమ్యూనికేషన్ నైపుణ్యాలపై అవగాహన కల్పిస్తారని ప్రిన్సిపాల్ వారుణి తెలిపారు. బాలికల విద్య, భవిష్యత్ ప్రణాళిక, లైంగికత, ముందస్తు వివాహం, పోషణ, మానసిక ఆరోగ్యం బాలికల చర్చలు ప్రణాళికలకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు.

ఫిజియోథెరపీ సెంటర్ తనిఖీ



తనిఖీ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు

జమ్మికుంట: పట్టణంలోని ఫిజియోథెరపీ సెంటర్‌ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశాల మేరకు హుజూరాబాద్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డా.చందు, వైద్య బృందంతో కలిసి సోమవారం తనిఖీ చేశారు. సెంటర్ నిర్వహణకు ఆన్‌లైన్ ద్వారా అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నాడని, డీఆర్ఏయాక్ట్ ప్రకారం సెంటర్‌లో సౌకర్యాలను పరిశీలించామన్నారు. నివేదికను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి అందిస్తామన్నారు. అలాగే హుజూరాబాద్ డివిజన్‌లో ప్రైవేటు హాస్పిటల్స్ రిజిస్ట్రేషన్ లేకుండా నడిపిస్తే డీఆర్ఏ చట్టప్రకారం చర్యలు తీసుకుంటమన్నారు. కార్యక్రమంలో డా.మహోన్నత పటేల్, జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ పంజాల ప్రతాప్‌గౌడ్ పాల్గొన్నారు.

జీఎస్ఆర్ ఐటీఐలో ప్లేస్మెంట్ డ్రైవ్



ఆర్డర్ పత్రాలు ఇస్తున్న ప్రిన్సిపాల్ వీర్రాజు, హెచ్ఆర్ క్రాంతికుమార్

జమ్మికుంట: పట్టణంలోని జీఎస్ఆర్ ఐటీఐలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు హైదరాబాద్‌లోని వరుణ్ మోటార్స్ ఆధ్వర్యంలో సోమవారం ప్లేస్మెంట్ డ్రైవ్ నిర్వహించారు. యాభై మంది విద్యార్థులు ఉపాధి కల్పించేందుకు కార్యక్రమం నిర్వహించగా 15 మంది విద్యార్థులకు వర్క్ ఆర్డర్ పత్రాలు అందజేశారని జీఎస్ఆర్ ఐటీఐ ప్రిన్సిపల్ ముప్క వీర్రాజు తెలిపారు. ఐటీఐలో ఎలక్ట్రిషియన్, ఫిట్టర్, డిజిల్ మెకానిక్ విభాగంలో చదువుకున్న విద్యార్థులకు ప్రముఖ కంపెనీల్లో మంచి వేతనంతో జాబ్ అవకాశాలు కల్పిస్తున్నామని, జమ్మికుంట పరిసరప్రాంత విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వరుణ మోటార్ హెచ్ఆర్ క్రాంతికుమార్, జమ్మికుంట ఇన్‌చార్జి సంతోష్, శిక్షకులు రవీందర్‌రెడ్డి, రంజిత్, శైలజ, శ్రీనివాస్, శివప్రసాద్, విద్యాసాగర్, మధుకర్ పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు చోరీ

ఇల్లందకుంట: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లోని మూడు సీసీ కెమెరాలు, కేబుల్ వైర్లు దుండగులు దొంగిలించారని, వాటి విలువ సుమారు రూ.40 వేల వరకు ఉంటుందని ఎస్సై క్రాంతికుమార్ తెలిపారు. హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎం చిటికెన వేణు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

గండిపడి రెండేళ్లు.. పూడ్చివేతకు ఎన్నేళ్లు?





- మరమ్మతుకు నోచుకోని కల్వల ప్రాజెక్టు
- చుక్క నీరులేక వెలవెలబోతున్న వైనం
- ఆందోళనలో మత్స్యకారులు, రైతులు

శంకరపట్నం: మండలంలోని కల్వల ప్రాజెక్ట్‌కు గండిపడి రెండేళ్లు గడిచింది. గద్దపాక, కల్వల గ్రామాలకు చెందిన మత్స్యకారులు ప్రాజెక్ట్‌పై ఆధారపడి చేపల పెంపకం చేపడుతుండగా, రెండేళ్లుగా చేపల పెంపకానికి నోచుకోవడం లేదు. ఈ రెండు గ్రామాలతో పాటు వీణవంక మండలంలోని సుమారు 10 గ్రామాల్లోని రెండు వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. 2023 జూలైలో కురిసిన వర్షాలతో ప్రాజెక్ట్‌లోకి వచ్చిన భారీ వరదలతో గండి పడింది. గండి పడడంతో అప్పుడు అధికారంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, మాజీ ఎంపీ వినోద్‌కుమార్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్‌లు వేర్వేరుగా ప్రాజెక్టును పరిశీలించారు. అప్పటి ప్రభుత్వం తాత్కాలిక మరమ్మతుకు రూ.9 లక్షలు మంజూరు చేయగా రింగ్‌బండ్ వేశారు. రింగ్‌బండ్ వరదనీటిలో కొట్టుకుపోవడంతో నిధులు నీళ్లపాలయ్యాయి.

శాశ్వత మరమ్మతు చేయాలని వినతి

శాశ్వతమరమ్మతు చేయాలని మత్స్యకారులు, రైతులు అధికారులు, నేతలకు వినతిపత్రాలు అందించారు. రూ.70 కోట్ల నిధులు కేటాయించాలని అసెంబ్లీలో హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ప్రస్తావించినప్పటికీ ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ప్రాజెక్ట్ చుక్కా నీరులేక వెలవెలబోతోంది. ఇకనైనా అధికారులు స్పందించాలని 200 మత్స్యకార కుటుంబాలు, ఆయకట్టు రైతులు కోరుతున్నారు.



ఇల్లందకుంట: మండలంలోని సీతంపేట అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు 2016–17 సంవత్సరంలో ప్రారంభించారు. ఏళ్లు గడుస్తున్నా నిధుల లేమితో పనులు పూర్తి చేయడంలేదని, శాశ్వత భవనం లేకపోవడంతో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల గదిలో అంగన్‌వాడీ కేంద్రాన్ని కొనసాగిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నిధులు మంజూరు చేయించి పనులు పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
శివకుమార్, పంచాయతీరాజ్ ఏఈ, సెల్ నం.: 63015 38145

టీబీ రహిత గ్రామాలుగా మార్చాలి



మాట్లాడుతున్న ట్రస్టీ మిస్టర్ పాల్, తదితరులు

తిమ్మాపూర్: మండలంలోని రామకృష్ణ కాలనీ గ్రామ పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో టీబీ రహిత గ్రామ పథకం పురోగతిపై సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా యూకే నుంచి వచ్చిన టీబీ అలర్ట్–యూకే ట్రస్టీ మిస్టర్ పాల్, కరీంనగర్ జిల్లా టీబీ అధికారి డాక్టర్ రవీందర్ రెడ్డి, టీబీ అలర్ట్ ఇండియా సీఈవో వికాస్, తిమ్మాపూర్ మండల పంచాయతీ అధికారి సురేందర్, స్థానిక వైద్య అధికారి డాక్టర్ ప్రణవ్ హాజరయ్యారు. జిల్లాలోని అన్ని గ్రామాలను, ముఖ్యంగా రామకృష్ణకాలనీని టీబీ రహిత గ్రామంగా మార్చేందుకు చేపట్టిన కార్యక్రమాలపై చర్చించారు. సమావేశంలో డీఆర్డీఏ నుంచి స్వయం సహాయక బృందాలు, ఫీల్డ్ అసిస్టెంట్, ఐసీడీఎస్ నుంచి అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య శాఖ నుంచి ఏఎన్ఎంలు, ఐదుగురు టీబీ చాంపియన్లు టీబీ నిర్మూలన కోసం చేపట్టిన కార్యకలాపాలను వివరించారు. రామకృష్ణ కాలనీని టీబీ రహిత గ్రామంగా మార్చేందుకు వివిధ శాఖలు, టీబీ చాంపియన్లతో కలిసి చేస్తున్న పనులను అతిథులు అడిగి తెలుసుకున్నారు. జిల్లా క్షయవ్యాధి నిర్మూలన అధికారి డాక్టర్ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ.. టీబీ వ్యాధిపై సామాజిక కళంకాన్ని తగ్గించేందుకు అన్ని శాఖలు టీబీ చాంపియన్లను ప్రతి కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలని, కరీంనగర్ జిల్లాలోని అన్ని గ్రామాలను టీబీ రహిత గ్రామాలుగా మార్చేందుకు ప్రజల సహకారం కీలకమని పేర్కొన్నారు. మండల పంచాయతీ అధికారి సురేందర్ మాట్లాడుతూ.. టీబీ వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు. రామకృష్ణ కాలనీని టీబీ రహిత గ్రామంగా మార్చేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. ముఖ్య అతిథి మిస్టర్ పాల్ మాట్లాడుతూ.. కరీంనగర్ జిల్లాలో గ్రామాలను టీబీ రహిత గ్రామాలుగా మార్చేందుకు డీఆర్డీఏ, ఈజీఎస్, ఐసీడీఎస్ విద్యా శాఖ, ఆరోగ్య శాఖ, టీబీ చాంపియన్లు సమన్వయంతో పనిచేయడం బాగుందన్నారు. సమష్టి కృషితో కరీంనగర్ జిల్లాను త్వరలో టీబీ రహిత జిల్లాగా చూడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీబీ అలర్ట్ ఇండియా సీఈవో వికాస్ పనిబట్ల, తెలంగాణ స్టేట్ లీడ్ పరస పురుషోత్తం, తిమ్మాపూర్ మండల పంచాయతీ అధికారి సురేందర్, వైద్య అధికారి డాక్టర్ ప్రణవ్, నేదునూరు ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ జెవేరియా, ఎస్టీఎస్ సదయ్య, కార్యదర్శి శ్రీకాంత్, ఏఎన్ఎంలు ఏ.రాణి, ఎం. సునంద, ఎం. పద్మ, వీవో లీడర్స్ రాధ, మహిళా గ్రూప్ సభ్యులు, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, ఇంపాక్ట్ ఇండియా జిల్లా లీడ్ ప్రభాకర్, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు పారిజాతం, వనిత, గీతాంజలి, శ్రీను, తిరుపతి, రాజబోస్, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మృత్యుంజయ హోమం



రామడుగు: మండలంలోని వెలిచాల గ్రామ శ్రీలక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో సోమవారం నిత్యకల్యాణోత్సవ కార్యక్రమం దేవాలయాభివృద్ధి కమిటీ చైర్మన్ వీర్ల ప్రభాకర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. అలాగే శివాలయంలో వేదపండుతులు మృత్యుంజయ హోమం నిర్వహించారు. ప్రభాకర్‌రావు జన్మదినం పురస్కరించుకొని కార్యక్రమాలు నిర్వహించామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో రామడుగు సింగిల్ విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వర్‌రావు, మాజీ జెడ్పీటీసీ కవిత, మాజీ సర్పంచ్ వీర్ల సరోజన, గ్రామస్తులు పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా పారాయణం



ఇల్లందకుంట: శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేటకు చెందిన హనుమాన్ చాలీసా భక్త బృందం జైన శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. జైశ్రీరామ్, జైజై హనుమాన్ నామస్మరణతో ఆలయ ప్రాంగణంమార్మోగింది. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఇంగిలే రామారావు, కమిటీ సభ్యులు నగేశ్, రాంరెడ్డి, పరమేశ్వర్, అర్చకులు వంశీధరచార్యులు, నవీన్‌శర్మ, ఆలయసిబ్బంది పాల్గొన్నారు.

సోలార్ సీసీ కెమెరా విరాళం

వీణవంక: మండలంలోని లస్మక్కపల్లి గ్రామానికి చెందిన యువకుడు మద్దుల ప్రశాంత్ సోలార్ సీసీ కెమెరాను ఎస్సై ఆవుల తిరుపతికి విరాళం అందజేశారు. నేరాల నియంత్రణకు ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై ఇచ్చిన పిలుపు మేరకు ప్రశాంత్ ముందుకు వచ్చాడు. తన వంతుగా సీసీ కెమెరాను అందించడంతో గ్రామస్తులు అభినందించారు. ప్రశాంత్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో మరిన్ని సీసీ కెమెరాలు ఇవ్వడానికి కృషి చేస్తానని, ప్రకటించారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై సర్వే



ఇంకుడుగుంతను పరిశీలిస్తున్న బృందం సభ్యులు

గన్నేరువరం: మండలంలోని మాదాపూర్, యాస్వాడ గ్రామాల్లో స్వచ్ఛ సర్వేక్షణ్ 2025 కేంద్ర ప్రభుత్వ సర్వే బృందం ఆధ్వర్యంలో అకాడమీ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ అనే సంస్థ సోమవారం సర్వే చేపట్టింది. చెత్త సమీకరణ తీరు, తరలింపు, ప్రభుత్వ సంస్థల పనితీరు, తదితర అంశాలను సూపర్ వైజర్ రజిత, రాణి పర్యవేక్షించారు. చెత్త సేకరణ, వ్యర్థాల నిర్వహణ, సెగ్రిగేషన్ షెడ్డులో వర్మి కంపోస్ట్ పద్ధతిలో సేంద్రియ ఎరువుల తయారీ, ప్లాస్టిక్ వినియోగం, ఇంకుడుగుంతల నిర్మాణం, శుద్ధజలం సరఫరా, పచ్చదనం, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, బహిరంగ ప్రదేశాల్లో పారిశుధ్య పరిస్థితి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన పథకాల అమలు తీరు వంటి అంశాలను పరిగణంలోకి తీసుకొని మార్కులు కేటాయిస్తూ సర్వే నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని 16 నివాస గృహాలను సందర్శించి వారి అభిప్రాయాలను క్రోడీకరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాస్, ఎస్‌బీఎం కోఆర్డినేటర్లు వేణుప్రసాద్, రమేష్, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, రాజశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, ఏఎన్ఎం, అంగన్‌వాడీ టీచర్లు, ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

✦ **ఆకస్మిక తనిఖీ**

మానకొండూర్: మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల, దివ్యాంగుల భవిత కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఇందిరమ్మ ఇంటి నిర్మాణం, గ్రోమోర్ సెంటర్‌ను అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకిడే సోమవారం ఆకస్మికంగాతనిఖీ చేశారు. ఉన్నత పాఠశాల విద్యార్థులకు వసతులు, హాజరు శాతం ఆరోగ్య కేంద్రంలో రోగులకు అందుతున్న సేవలు, తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు.

✦ **పోలీసుల కృషి అభినందనీయం**

ఇల్లందకుంట: ప్రజాసమస్యలను పరిష్కరించడంలో పోలీసుల కృషి ఎంతో అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు, శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థాన చైర్మన్ ఇంగిలే రామారావు అన్నారు. ఇటీవల బదిలీపై ఇల్లందకుంట ఎస్సై క్రాంతికుమార్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి దేవస్థానం మెమెంటో అందజేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు శాంతియుతంగా జరిగేలా చూడాలని కోరారు.

✦ **ప్రణవ్‌ను విమర్శిస్తే ఊరుకోం**

హుజూరాబాద్: కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్‌ను బీఆర్ఎస్ నాయకులు విమర్శిస్తే ఊరుకోబోమని యువజన కాంగ్రెస్ నాయకులు సందమల్ల నరేశ్ అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్ కార్యాలయంలో మాట్లాడారు.

✦ **దాడి చేసినవారిపై చర్యలు తీసుకోవాలి**

ఇల్లందకుంట: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ సిబ్బందిపై శనివారం దాడిచేసిన వారిపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ డిమాండ్ చేశారు. సోమవారం పంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.

✦ **క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి**

జమ్మికుంట: జమ్మికుంట మున్సిపల్ పరిధి కొత్తపల్లికి చెందిన ఓ కాంగ్రెస్ పార్టీ నాయకుడిపై అదే గ్రామానికి చెందిన జమ్మికుంట పట్టణ మాజీ అధ్యక్షుడు కసుబోజుల వెంకన్న టీపీసీసీ రాష్ట్ర ఇంచార్జి మీనాక్షి నటరాజన్‌కు సోమవారం పోస్ట్ ద్వారా ఫిర్యాదు చేశారు. పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నాడని, క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

✦ **వర్షాలు కురవాలని కప్పతల్లి ఆట**

వీణవంక: వర్షాలు కురవాలని మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీవాసులు కప్పతల్లి ఆడారు. గ్రామ వీధుల గుండా తిరుగుతూ వరుణ దేవుడిని వేడుకున్నారు. వర్షాకాలంలో ఇప్పటి వరకు ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదని, నారుమడులు ముదిరిపోయే అవకాశం ఉందని వాపోయారు.

✦ **రూ.ఆరువేల పింఛన్ ఇవ్వాలి**

చొప్పదండి: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగులకు రూ.ఆరు వేల పింఛన్ అమలు చేయాలని ఎంఆర్‌పీఎస్ నియోజకవర్గ ఇంచార్జి తడగొండ శంకర్ కోరారు. మండలంలోని ఆర్నకొండలో సోమవారం దివ్యాంగులతో సమావేశం నిర్వహించారు.

✦ **పరిహారం ఇవ్వాలి**

శంకరపట్నం: బైపాస్ రోడ్డు నిర్మాణం కోసం కేశవపట్నం శివారులో సేకరించిన వ్యవసాయభూమికి పరిహారం ఇవ్వాలని ప్రజావాణిలో కలెక్టర్‌కు మ్యాకల కొంరయ్య సోమవారం ఫిర్యాదు చేశారు. కొంరయ్య, సముద్రాల చంద్రయ్యకు 14 గుంటల చొప్పున వ్యవసాయ భూమి ఉంది. బైపాస్ రోడ్డులో ఇద్దరూ భూమి కోల్పోయారు. రోడ్డు పనులు పూర్తి చేసినప్పటికీ పరిహారం ఇవ్వకుండా హుజూరాబాద్ ఆర్డీవో ఇబ్బందులకు గురిచేస్తున్నాడని గతంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

✦ **తొలగించిన రోడ్డు తిరిగి ఏర్పాటు**

శంకరపట్నం: మండలంలోని కన్నాపూర్ బీసీకాలనీలో తొలగించిన రోడ్డును సోమవారం మాజీ సర్పంచ్ కాటం శివారెడ్డి తిరిగి నిర్మించారు. బీసీ కాలనీ(కిష్కిందపల్లి) 24 ఫీట్ల దారిని ఆదివారం పది ఫీట్ల వరకు తొలగించాడని కాలనీవాసులు సోమవారం కేశవపట్నం పోలీస్‌స్టేషన్‌లో మాజీ సర్పంచ్‌పై ఫిర్యాదు చేశారు.

✦ **సుందరగిరిలో ప్రజాభిప్రాయసేకరణ**

చిగురుమామిడి: మండలంలోని సుందరగిరి గ్రామం మధ్యలో నుంచి రహదారి నిర్మించొద్దని, ఇళ్లు కోల్పోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తూ సోమవారం స్థానిక రైతు వేదికలో సమావేశమై ప్రజాభిప్రాయసేకరణ నిర్వహించారు. ఇళ్లు కోల్పోతున్న బాధితులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తామన్నారు.

✦ **బైక్‌తో ఢీకొట్టిన వ్యక్తిపై కేసు**

జమ్మికుంట: బైక్‌తో ఢీకొట్టిన ఓ వ్యక్తిపై సోమవారం కేసు నమోదు చేశామని టౌన్ సీఐ రామకృష్ణ తెలిపారు. మున్సిపల్ పరిధి అబాది జమ్మికుంటకు చెందిన మహమ్మద్ అలీమొద్దీన్ పట్టణంలోని రాజరాజేశ్వరీ మిల్లు వద్దకు వెళ్లి వస్తుండగా మండలంలోని సైదాబాద్ గ్రామానికి చెందిన ఆకుల అభిలాశ్ అజాగ్రత్తగా బైక్ నడుపుతూ ఢీకొట్టాడు. బాధితుడి కుమారుడు ఎండీ యాకూబ్ పాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

✦ **ఎస్ఎఫ్ఐయూఐ నిరసన**

శంకరపట్నం: లైంగిక వేధింపులకు గురైన బీఈడీ విద్యార్థినికి న్యాయం చేయాలని కేశవపట్నంలో ఎస్ఎఫ్ఐయూఐ నాయకులు సోమవారం నిరసన తెలిపారు. ఒడిశాలోని బాలాపూర్ జిల్లా ఫకీర్ మోహన్ యూనివర్సిటీలో బీఈడీ విద్యార్థినిపై అధ్యాపకుడు సమీర్‌సాహూ లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఘటనపై కేంద్రం, ఒడిశా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

✦ **యజమానిపై కేసు**

శంకరపట్నం: కేశవపట్నంలో మైనర్ బాలుడితో గొర్రెలు కాపరి పనులు చేయిస్తున్న యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు. బాలుడిని అసిస్టెంట్ లేబర్ అధికారి చందన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామన్నారు.

✦ **విచారణ చేయాలి**

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ గ్రామంలో ధోబీ ఘాట్ స్థలంలో ఇళ్లు నిర్మిస్తున్నారని రజక సంఘం నాయకులు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఇళ్ల నిర్మాణంపై విచారణ చేయాలని తహసీల్దార్‌ను కలెక్టర్ ఆదేశించినట్లు రజక సంఘం నాయకులు తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రసమయి

మానకొండూర్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. సదాశివపల్లి మీనాక్షి ఫంక్షన్‌హాల్లో సోమవారం తిమ్మాపూర్ మండల బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు విజయం సాధించే దిశగా కార్యకర్తలు, నాయకులు పనిచేయాలని,. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసం లేదని, ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమైందన్నారు. ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని, సోషల్ మీడియా ద్వారా పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని, గెలుపు కోసం ప్రణాళికలు తయారు చేసుకోవాలని సూచించారు. పట్టుదలతో పనిచేస్తే పార్టీలో గౌరవం ఉంటుందని, బీసీలకు మేలు చేసిన పార్టీ బీఆర్ఎస్ అనిఅన్నారు. బీసీ రిజర్వేషన్లలో కుట్ర దాగి ఉందన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీరామకృష్ణారావు మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చిన సిద్ధంగా ఉండాలని సూచించారు. పార్టీకి అభ్యర్థులను గెలిపించుకునేందుకు కృషి చేయాలన్నారు. మండల అధ్యక్షుడు రావుల రమేశ్, కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, అనబేరి రాధాకిషన్‌రావు, ఉల్లెంగుల ఏకానందం, బోయిని కొంరయ్య, మాతంగి లక్ష్మణ్ పాల్గొన్నారు.

మెడికల్ ఏజెన్సీలపై విచారణ జరిపించాలి



వినతిపత్రం అందజేస్తున్న యుగంధర్

కరీంనగర్‌టౌన్: జిల్లాలోని మెడికల్ ఏజెన్సీలపై సీబీసీఐడీ విచారణ జరిపించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బావండ్లపల్లి యుగేందర్ సోమవారం ప్రజావాణిలో అదనపు కలెక్టర్ ప్రపుల్‌దేశాయ్‌కి వినతిపత్రం అందజేశారు. నకిలీ మందుల తయారీ ఫార్మసీ కంపెనీ యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. మందుబిళ్లల ఉత్పత్తుల్లో నాణ్యత ప్రమాణాలను గుర్తించేందుకు ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. నాణ్యత పాటించని యెడల అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సురేశ్, సురేందర్ పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన కరీంనగర్ అదనపు డీసీపీ

గంగాధర: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను సోమవారం కరీంనగర్ అదనపు డీసీపీ భీమ్‌రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ భవనం నిర్మించిన స్థలం, స్టేషన్‌లో క్రైం వాహనాలు వాటి వివరాలు తెలుసుకున్నారు. ప్రమాదాలకు గురైన వాహనాల వివరాలు, స్టేషన్‌లో అమలవుతున్న 5 ఎస్ విధానం స్టేషన్ రికార్డు, స్టేషన్‌కు కెటాయించిన ప్రాపర్టీని పరిశీలించారు. పోలీస్ క్వార్టర్స్ పరిస్థితిని తెలుసుకున్నారు. నీటి, విద్యుత్ సరఫరా, సీసీ టీవీ, వాహనాల పనితీరు పరిశీలించారు. వెంట ఎస్సై వంశీకృష్ణ, ఆర్ఎస్ఐ తిరుపతి, ఏఎస్సైలు మల్లేశం, భగవాన్‌రెడ్డి సిబ్బంది ఉన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

హుజూరాబాద్: పట్టణంలోని పలు ప్రదేశాల్లో గంజాయి, మత్తుపదార్థాలు సేవిస్తున్నారనే అనుమానంతో సోమవారం టౌన్ సీఐ కరుణాకర్ ఆధ్వర్యంలో కరీంనగర్ స్పెషల్ టీం విస్తృత తనిఖీలు చేసింది. బస్టాండ్, సూపర్ మార్కెట్, అనుమానిత ప్రాంతాలను తనిఖీ చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, మత్తు పదార్థాల వినియోగం, విక్రయంపై పోలీసులకు సమాచారం అందించాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. తనిఖీల్లో ఎస్ఐ రాధాకిషన్, పోలీస్‌సిబ్బంది ఉన్నారు.

స్టీల్ ప్లేట్లు పంపిణీ



హుజూరాబాద్: పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్టీల్ ప్లేట్లు ట్రస్ట్ నిర్వాహకుడు గంగిశెట్టి జగదీశ్వర్ ఆధ్వర్యంలో ఎంఈవో భూపతి శ్రీనివాస్ పంపిణీ చేశారు. అనంతరం ఎంఈవో మాట్లాడారు. ప్రతి సంవత్సరం ట్రస్ట్ తరుపున ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు విద్యా సామగ్రి, ఇతర వస్తువులను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం శోభారాణి, హెచ్‌ఎం మేఘన, ఉపాధ్యాయులు తదితరులున్నారు. మున్సిపాలిటీ పరిధి బోర్నపల్లి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు స్కాయ్ గ్రూప్ ఆధ్వర్యంలో సమాజసేవా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు టై, బెల్టులు, ఎగ్జామ్ ప్యాడ్లు, ఇతర విద్యా సామగ్రిని నిర్వాహకులు పంపిణీ చేశారు.



క్రీడా దుస్తులు

గంగాధర: మండలంలోని గర్షకుర్తి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం బీజేపీ నాయకుడు పెరుక శ్రావణ్ క్రీడా దుస్తులు పంపిణీ చేశాడు. తండ్రి మల్లారెడ్డి జ్ఞాపకార్థం కార్యక్రమం చేపట్టినట్టు తెలిపాడు. తండ్రి ఆశయాలను కొనసాగించడానికి సేవా కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. నాయకులు కోల అశోక్, చిందం ఆంజనేయులు, దయ్యాల ప్రణయ్, తూం కరుణాకర్, కొలిపాక తిరుపతి శ్రీకాంత్, హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు శ్యాంకుమార్ పాల్గొన్నారు.